క్లుప్తంగా

కురుపాం ఎంపీడీఓగా ఉమామహేశ్వరి


ఉమామహేశ్వరి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం ఎంపీడీఓగా జె.ఉమామహేశ్వరి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా కురుపాం ఎంపీడీఓ ఎస్.అప్పారావుకు ఎస్.కోటకు బదిలీ కావటంతో ఆయన స్థానంలో పాలకొండ ఎంపీడీఓ ఉమామహేశ్వరిని అధికారులు నియమించారు. ఈ మేరకు విధుల్లో చేరిన ఎంపీడీఓ మండలాభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

ఎంపీడీఓగా వెంకటరమణ..


వెంకటరమణ

వీరఘట్టం: ఎంపీడీఓగా బి. వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. తాగునీరు, పారిశుధ్య పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సిబ్బందికి సూచించారు.

తహసీల్దార్‌గా అప్పారావు..

భామిని: మండల తహసీల్దార్‌గా నీలాపు అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన గుమ్మలక్ష్మీపురం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అలాగే డీటీ నిమ్మల శేఖరం గుమ్మలక్ష్మీపురానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

గురుగుబిల్లి తహసీల్దార్‌గా బాల..


తహసీల్దార్ బాలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీ లక్ష్మీకుమార్, తదితరులు

గరుగుబిల్లి: మండల తహసీల్దార్‌గా పి.బాల శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండల తహసీల్దార్‌గా పని చేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సిబ్బందితో సమన్వయం చేసుకొని రైతులకు మెరుగైన సేవలను అందిస్తామన్నారు. తహసీల్దార్‌కు ఉప తహసీల్దార్ లక్ష్మీకుమార్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎక్సైజ్ సీఐ

వీరఘట్టం: పాలకొండ సర్కిల్ ఎక్సైజ్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సూర్యకుమారి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సారా నిర్మూలన, మద్యం విక్రయాలపై చర్చించారు.

సోరా భాషపై శిక్షణ


శిక్షణలో పాల్గొన్న అక్షరబ్రహ్మ వలంటీర్లు

సీతంపేట: మండలంలోని నౌగూడలో అక్షర బ్రహ్మ వలంటీర్లకు సోరా భాషపై ఏవైఎస్ డైరెక్టర్ కె.కామేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోరా భాష, లిపి, క్రమశిక్షణ, సంస్కృతీ, సంప్రదాయాలపై చిన్నారులకు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో తిరుపతి, వెంకటరావు, చిన్నరాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేప ఉత్పత్తులు.. పంటలకు మేలు

- ఎరువు తయారీ ఖర్చు తక్కువ
- దాదాపు 300 రకాల కీటకాలను పోగొట్టే గుణం
- పంటలకు ఉపయోగిస్తే అధిక దిగుబడులు


ఏజెన్సీలో విరివిగా లభించే వేప

గుమ్మలక్ష్మీపురం: వేప ఉత్పత్తులు సాగుకు ఎంతో మేలు చేస్తుంది. సర్వ రోగ నివారిణి అయిన వేప పంట సాగుకు ఉపయోగకరం. పంటలకు వేప ఉత్పత్తులు వాడితే ఎంతో మేలు చేకూరుతుంది. వేపలో ఆజాడిరాక్టిన్ అనుకూల పదార్థం ఉంటుంది. దీనికి 300 రకాల కీటకాలు, నల్లజాతి పురుగులు, చెదలు, భూమిలోని కొన్ని రకాల బూజు శిలీంద్రాలను అరికట్టే శక్తి ఉంటుంది. వరి, పత్తి, కూరగాయలు, పండ్ల మొక్కలు, ఉద్యాన పంటలను ఆశించే కీటకాలను వేప అరికడుతుంది. మార్కెట్లో వేప పిండి, వేపనూనె, వేప కషాయం ఇలా వివిధ రకాల వేప ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయి. నీమ్ ఆయిల్ వ్యవసాయ నిపుణుల సూచన మేరకు వినియోగిస్తే కీటకాలు నివారించవచ్చు. ఈ మందును పిచికారీ చేయడం వలన పంటల్లో ఆశించిన పురుగులకు వికారం కలిగించి పైరును నాశనం చేయకుండా చేస్తుంది. విషపూరిత అవశేషాలు ఉండవు. సమగ్ర సస్యరక్షణ విధానంలో వేప మందులు బాగా ఉపయుక్తమవుతాయి.

వేపనూనె పిచికారీతో ప్రయోజనం

పైరును పురుగు ఆశించిన వెంటనే వేప నూనె పిచికారీ చేస్తే చాలా ప్రయోజనం ఉంటుంది. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే పిచికారీ చేస్తే ఇంకా మంచిది. 3 నుంచి 5 మిల్లీ లీటర్ల నీమ్ ఆయిల్‌కు లీటరు నీటితో కలిపి 20 లీటర్లు పిచికారీ చేయాలి. వాతావరణం చల్లగా ఉన్న సమయాల్లో (ఉదయం లేదా సాయంత్రం) 7 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. పిచికారీ చేసిన తర్వాత 6 గంటల వ్యవధిలో వర్షం పడితే మళ్లీ పిచికారీ చేయాల్సింది.

తెగుళ్ల నివారణ

వివిధ పంటల్లో వేప మందుల వాడకంతో వివిధ చీడపీడలను నివారించవచ్చు. వరి పంటలకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేప పిండిని దమ్ములో వేయడం ద్వారా కాండం తొలిచే పురుగును అదుపు చేయవచ్చు. వరి పైరుపై లీటరు నీటికి 3 మిల్లీ లీటర్ల చొప్పున్న కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్లు పిచికారీ చేస్తే అగ్గి తెగులు, తోడిమికుళ్లు, పొడతెగులు, వరితుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. 5 శాతం వేపప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిరప పంటల్లో పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. తద్వారా మిరప మీద వచ్చే జెమినీ వైరస్ అదుపులో ఉంటుంది. టమాటా సాగులో ఎండు తెగులును వేప నూనెలో నివారించవచ్చు.

ఇంట్లోనే వేప కషాయం తయారీ

పంటకు అవసరమైన వేప కషాయాన్ని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. 5 కిలోల వేప గింజలు నలగగొట్టి 6 నుంచి 7 లీటర్ల నీటిలో రెండు, మూడు రోజులు నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో పోసి వడకట్టాలి, మరో 100 లీటర్ల నీటిని అందులో కలిపి వినియోగించాలి. పైరుకు పిచికారీ చేస్తే అద్భుత ఫలితాలు ఉంటాయి.

వేప పిండితో మంచి ఫలితాలు

వేప ఉత్పత్తులతో మంచి దిగుబడులు వస్తాయి. నూనె తీయగా వచ్చే వేపచెక్క, ఎండిన వేపకాయలను దంచితే వేపపిండి తయారవుతుంది. ఈ పిండిని ఎక్కువగా వరి, మిరప పంటలు, నిమ్మ తోటలకు వాడవచ్చు. దిగుబడిలో మంచి ఫలితాలు పొందవచ్చు. రసాయనిక ఎరువులు ఎక్కువగా వినియోగిస్తే భూమి స్వభావం తగ్గిపోతుంది. ఈ మేరకు వేప ప్రయోజనంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– సీహెచ్ ప్రసాద్, ఏఓ

‘ఉపాధి’ని వ్యవసాయంతో అనుసంధానం చేయాలి


సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా ఉపాధి పనులపై వివరిస్తున్న రైతులు, సంఘ నాయకులు

పాలకొండ రూరల్: ఉపాధి పనులను వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు అన్నారు. ఈ మేరకు పలువురు రైతులు, ఆయా సంఘ నాయకులతో కలసి పాలకొండ సబ్ కలక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డిని శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అభ్యుదయ రైతు ప్రసాదరావు మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి ఉపాధి పనులు జత చేస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తమ పంచాయతీ పరిధిలో గల 40 ఎకరాల నరసింహ చెరువు పరిధిలో ఐదు మదుములు ఉన్నాయన్నారు. ఉపాధి పనుల్లో భాగంగా ఈ చెరువును అభివృద్ధి చేస్తే సాగు విస్తీర్ణం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నేరడబిల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మెగా నీటి పథకం పనుల పరిశీలన


పైప్‌లైన్ పనులు పరిశీలిస్తున్న డీఈఈ మధుసూదనరావు, తదితరులు

భామిని: మండలంలోని అన్ని గ్రామాలకూ తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేస్తున్న మెగా నీటిపథకం నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జి. మధుసూదనరావు, ఏఈఈ అలికాన సందీప్ శుక్రవారం పరిశీలించారు. బురుజోల నుంచి బత్తిలి వరకు ఉన్న పైప్‌లైన్లు, లింకింగ్ సిస్టమ్ పనులపై ఆరా తీశారు. త్వరితగతిన పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ ఎం.తిరుమలరావు, కాంట్రాక్టర్ ప్రతినిధులన్నారు.

రూ. వందకు చేరిన టమాటా



సీతంపేట: మండల కేంద్రంలోని మార్కెట్‌లో కిలో టమాటా శుక్రవారం వంద రూపాయలకు చేరుకుంది. రెండు రోజుల కిందటి వరకు 65 రూపాయలు పలికిన టమాటా ఒక్కసారిగా వంద రూపాయలకు చేరుకోవడంతో కొనుగోలుదారులకు చుక్కలు కనిపించాయి. దసరా నేపథ్యంలో కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.

గుంతలు పూడ్చేదెప్పుడో..?


ప్రమాదకరంగా మారిన గుంత

సీతంపేట: సీతంపేట – దోనుబాయి రహదారిపై ఏర్పడిన గోతులతో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మొగదార, చంద్రమ్మగుడి, తదితర ప్రాంతాల వద్ద భారీ గుంతలు ఏర్పడడంతో వర్షపు నీరు ప్రమాదాలు జరుగుతున్నాయి అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

పిల్లలతో కలిసి ఓ తల్లి ఆత్మహత్యాయత్నం

- భర్తపై కోపంతో పురుగు మందు తాగిన తల్లి
- గమనించి ఆస్పత్రికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు


ఆస్పత్రిలో రమ్య, చిన్నారులు

గుమ్మలక్ష్మీపురం: కురుపాం మండలం లంకాజోడు గ్రామానికి చెందిన బిడ్డిక రమ్య తన భర్త రమేష్‌పై కోపంతో శుక్రవారం రాత్రి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రమ్య చెల్లితో భర్తకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో భార్యభర్తల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మనస్తాపం చెందిన రమ్య తన ఇద్దరు పిల్లలు ఆర్యన్, ఆరునిలకు పురుగుమందు పట్టింది. తనూ పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నిస్తుండగా కుటుంబ సభ్యులు గమనించి నిలువరించారు. ముగ్గురినీ భద్రగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక వైద్యసేవలు అనంతరం మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు.

నేడు రక్తదాన శిబిరం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం పెట్రోల్ బంకు సమీపంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వాయుపుత్ర సేవా సంఘం ప్రతినిధులు బోటు అనిల్‌కుమార్, స్వాతి, గెంబలి ప్రదీప్‌కుమార్, నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం చేసి ప్రాణదానం కావాలని వారు పిలుపునిచ్చారు.

ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలి..

- డీఎస్పీ రాంబాబు


డీఎస్పీని సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ ఎం.శ్యామ్ బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు రెట్టించిన ఉత్సాహంతో చదవి మంచి ర్యాంకులు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అలాగే డీఎస్పీ రాంబాబును నిర్వాహకులు సత్కరించారు.

నూతన రహదారులు ప్రారంభం


చిట్టపులివలస బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం: గత వైఎస్సార్‌సీపీ హయాంలో శంకుస్థాపన చేసి రూ.1.20 కోట్లతో నిర్మించిన చిట్టపులివలస బీటీ రహదారితో పాటు ఇటీవల రూ. 50 లక్షలతో పూర్తి చేసిన యు.వెంకమ్మపేట సీసీ రోడ్డును ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దుక్కు ట్రాక్టర్లు నడపడం వల్ల రోడ్లు త్వరగా పాడవుతున్నాయన్నారు. రహదారుల భద్రత అందరి బాధ్యతని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిమ్మక పాండురంగ, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయ్‌కుమార్, మాచర్ల అనిల్, వెలగాడ శ్రీను, గుంట్రెడ్డి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

తోటలో వైద్య శిబిరం


గిరిశిఖర గ్రామంలో వైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ పంచాయతీ తోట గిరిశిఖర గిరిజన గ్రామంలో రాఫా ఫౌండేషన్, మధుశ్రీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైరల్ జ్వరాలు, తలనొప్పి, జలుబు, దగ్గు, ఒళ్లు, కీళ్లు, ఒంటి నొప్పులతో బాధపడుతూ వచ్చిన 84 మందికి మధుశ్రీ హెల్త్ కేర్(క్లీనిక్) వైద్యులు రవికుమార్ వైద్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా రాఫా ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీణ్ కంటి మహంతి ఆ గ్రామ గిరిజనులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రాథమికంగా తాము అందించిన వైద్యసేవలతో నయం కాకుంటే సమీపంలోని ఆస్పత్రుల వద్దకు వెళ్లి మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. శిబిరంలో రాఫా ఫౌండేషన్ ప్రతినిధి జి.పెంటయ్య తదితరులు తమ సేవలు అందించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్‌ను నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరీ అన్నారు. మండలంలోని బోయిపాక పంచాయతీ కేంద్రంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. హౌసింగ్, పింఛన్లు, రిటర్నింగ్‌వాల్ తదితర సమస్యలకు సంబంధించి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం, లింక్ రహదారుల నిర్మాణం, కాలువల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు లబ్ధిదారులకు అవగాహన కల్పించేలా ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కె.లక్ష్మి వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు


గాయపడిన యువకుడు జోనేష్

భామిని: మండలంలోని నల్లరాయిగూడకు చెందిన బిడ్డికి జోనేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం రాత్రి ఆయన తన స్వగ్రామం నుంచి కొత్తూరు వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. ఘనసర దగ్గర వాహనం అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలు కాగా.. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనంలో కొత్తూరు ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రుడ్ని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి చర్యలు

సీతంపేట: స్థానిక శాఖా గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోనున్నట్లు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. భవనం చిన్నది కావడంతో పాత మండల మహిళా సమాఖ్య భవనంలోకి మార్చాలని ఆదేశించారు. అన్ని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని లైబ్రేరియన్ బబ్బురు గణేష్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు పాల్గొన్నారు.

చేతిబోరుకు మరమ్మతులు


చేతి బోరుకు మరమ్మతులు చేపడుతున్న నగర పంచాయతీ సిబ్బంది

పాలకొండ రూరల్: నగరంలోని గారమ్మకాలనీ పాడైన చేతిబోరుకు నగర పంచాయతీ సిబ్బంది శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. నగర కమిషనర్ ఎస్. సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది కాలనీకి చేరుకుని భూ అంతర్భాగంలో ఉండిపోయిన చేతి బోరుకు ఎత్తు పెంచి వినియోగంలోకి తీసుకువచ్చారు. త్వరలోనే కాలనీలో మౌలిక వసతుల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

గాయత్రీదేవిగా కోటదుర్గమ్మ


భామిని: లలితాదేవి సన్నిధిలో పూజలు చేస్తున్న మహిళలు


పాలకొండ: గాయత్రీదేవి అలంకరణలో కోటదుర్గమ్మ

పాలకొండ: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ శుక్రవారం గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ప్రధానార్చకుడు దార్లపుడి లక్ష్మీప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సహకారంతో మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. డీఎస్పీ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. షిర్డీసాయి నగర్‌లో ఉన్న సాయి మందిరంలో ఏర్పాటు చేసిన నవ దుర్గలకు కూడా ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు.

కరుణించు కనకదుర్గ..

వీరఘట్టం: మమ్మల్ని కరుణించి కాపాడు తల్లీ అంటూ భవానీ భక్తులు కోటదుర్గ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. దసరా మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కలశాల వద్ద యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు చేపట్టారు. సాయంత్రం పెద్ద ఎత్తున భక్తులు కోటదుర్గను దర్శించుకున్నారు. సాయంత్రం భవానీ భక్తులు శరణు ఘోషతో అమ్మవారికి పూజలు చేశారు. అలాగే కిమ్మి దుర్గాదేవి మండపంలో కూడా ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష పుష్పార్చన..


పాలకొండ: సాయి మందిరంలో నవదుర్గ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న మహిళలు

భామిని: మండలంలోని బత్తిలిలో గల లలిత త్రిపుర సుందరీదేవి సన్నిధిలో అమ్మవారికి లక్ష పుష్పార్చన చేపట్టారు. అలాగే కోటదుర్గమ్మ సన్నిధిలో భవానీ స్వాములు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు.


వీరఘట్టం : దుర్గగుడిలో కుంకుమపూజలు చేస్తున్న మహిళలు


వీరఘట్టం : కిమ్మిలో పూజలు చేస్తున్న భవానీ భక్తులు


భామిని: కోటదుర్గమ్మ సన్నిధిలో పూజల్లో భవానీ స్వాములు

గురువులకు సమున్నత స్థానం


దుర్గా ప్రసాద్ పాడి దంపతులను సన్మానిస్తున్న ఒడియా టీచర్లు

భామిని: సమాజంలో గురువులకు సమున్నత స్థానం ఉందని పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ ఎం. ప్రఫుల్లకుమార్, బంగారు వ్యాపారి శాసనపురి రామకృష్ణ, ఒడియా లెక్చరర్ జ్ఞానేశ్వర గోడ్ అన్నారు. జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న దుర్గాప్రసాద్‌ను బత్తిలిలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఓటీఏ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.సుశీలా, ఎస్,రాజశేఖర్, సంతోషిమాత ఆలయ కమిటీ చైర్మన్ భానుప్రసాద్ సాహూ, స్థానికులు పాల్గొన్నారు.